ఐఆర్‌సీఎస్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట, జూలై 21 : రామాయంపేటలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ కాంప్లెక్స్ స్కూల్ (ఐఆర్‌సీఎస్) నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తహసీల్దార్ రజినీకుమారికి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాలు జారీ చేశారు. శనివారం రాత్రి కలెక్టర్ కార్యాలయం నుంచి మెస్సేజ్ వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. రామాయంపేట జాతీయ రహదారి పక్కనే అసైన్‌మెంట్ ప్రభుత్వ భూమి 1421 సర్వే నంబర్‌లో ఉన్న స్థలాన్ని రెసిడెన్సియల్ స్కూల్‌కు అనువుగా ఉంటుందని కలెక్టర్ తెలిపినట్లు తహసీల్దార్ ఆదివారం విలేకరులతో తెలిపారు. పట్టణానికి చేరువలో డబుల్‌బెడ్ రూం ఇండ్ల సముదాయం ఉండడంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్‌కు అణువుగా ఉంటుందని కలెక్టర్ సూచించినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతోప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

రామాయంపేట, జూలై 21: సీజనల్ వ్యాధుల నివారణకు పలు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో షాలుద్దీన్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని కోనాపూర్, రాయిలాపూర్, డి.ధర్మారం తదితర గ్రామాల్లో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు కార్యదర్శులతో కలిసి దోమల నివారణకు మందును పిచికారీ చేయించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. రాయిలాపూర్, డి.ధర్మారం

గిరిజన తండాలో దోమల మందును పిచికారీ చేయిస్తున్న ఎంపీడీవో

గ్రామాల్లో ఫాగింగ్ యంత్రంతో కార్యదర్శి మహేందర్ పొగమందును రాత్రి వేళల్లో పిచికారీ చేయిస్తున్నారు.

భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి

ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 21 : భక్తులతో మెదక్ చర్చి కిటకిటలాడింది. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో చర్చి లోపలి ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా యేసయ్య నామస్మరణతో హోరెత్తింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంట గంటకు జరిగిన ప్రార్థనల్లో భక్తులు పాల్గొన్నారు. భక్తులనుద్దేశించి చర్చి ప్రెసీబేటరీ ఇన్‌చార్జి శాంతయ్యతో పాటు పాస్టర్లు దైవసందేశం చేశారు. ప్రార్థనల అనంతరం పాస్టర్లు భక్తులను ఆశ్వీరదించారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, శాంసన్ సందీప్, ఫ్రాంక్ జాన్సన్, సువణ్ డగ్లస్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యం యోగాతో ఆరోగ్యం

గురపౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్న యోగా గురూజీ దంపతులు, లయన్స్ క్లబ్ సభ్యులు

నర్సాపూర్, జూలై 21 : నిత్యం యోగా చేస్తే ఎలాంటి వ్యాధులు ధరి చేరవని హైదరాబాద్‌కు చెందిన యోగా గురూజీ కిష్టంగారి బైరయ్య సూర్యకళ దంపతులు వెల్లడించారు. ఆదివారం గురుపూర్ణిమ సందర్భంగా నర్సాపూర్ లయన్స్ క్లబ్, నిత్య జీవన యోగా సాధన సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురుపూర్ణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ముందుగా అష్టాదశ పురాణాలను రాసిన వేద వ్యాసుడి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు చంద్రశేఖర్, సురేందర్‌గౌడ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, సెక్రటరీ శ్రీకాంత్, జిల్లా కోశాధికారి నరసింహారెడ్డి, కౌన్సిలర్ బుచ్చేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైతుల రిలే నిరాహార దీక్ష

నర్సాపూర్‌లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న రైతులు

నర్సాపూర్, జూలై 21 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రైతులు రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. నర్సాపూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో కొండపోచమ్మ కాల్వ భూనిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి 10వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో రైతులు మహేశ్‌గౌడ్, నరసింహారెడ్డి, రాజమౌళి, ప్రేమ్‌చరణ్, శ్రీకాంత్‌రెడ్డి, అంజాగౌడ్, తుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం

దివ్యాంగులకు ఆర్థికసాయం అందజేస్తున్న గురుపీఠం వ్యవస్థాపకుడు శివకుమార్‌గౌడ్

శివ్వంపేట, జూలై 21 : గురుపీఠం చారిట బుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని గురుపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం గూడురు గ్రామంలోని గురుపీఠం బాలాలయంలో గురుపీఠం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని 18మంది దివ్యాంగులకు నగదు రూపంలో ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేదవ్యాస భగవానుడి జన్మదినం సందర్భంగా దివ్యాంగులకు నిస్వార్థంగా సేవ చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. దత్తాత్రేయస్వామి స్తోత్రమాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. అనంతరం గురుపీఠం ఎండీ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో తాజా మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా, సూర్యం కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరావు, సుదర్శన్‌గౌడ్, రాజ్యం భిక్షపతియాదవ్, గొల్ల యాదయ్య, బల్కంపేట భాస్కర్, భాస్కర్‌గుప్తా, కొడకంచి రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి

ఆర్థిక సహాయం అందజేస్తున్న కానిస్టేబుల్ రమేశ్

తూప్రాన్, జూలై 21 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ విషమించి వ్యక్తి మృతి చెందిన ఘటన తూప్రాన్ పోలీస్ట్ స్టేషన్ పరిధిలో జరిగింది. తూప్రాన్ ఎస్సై యాదగిరి తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మంగ బాడి గ్రామానికి చెందిన నాగ రావ్ హన్మాండ్లు రఫన్‌వార్ (40)కుటుంబంతో కలిసి 4 నెలల క్రితం బ్రతుకు దెరువు కోసం తూప్రాన్ వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ నెల 18న తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా టీటైమ్ ఎదురుగా నడుచుకుంటూ వెళ్తున్న హన్మాండ్లును స్కూటీపై వెళ్తున్న మనోహరాబాద్ మండలం పాలాట గ్రామానికి చెందిన కొత్తపల్లి సుధాకర్ ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానాకు తరలించి చికిత్స అం దించారు. మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ దవాఖానాకు తరలించగా, పరిస్థితి విషమించి ఈ నెల 20న రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడిది నిరుపేద కుటుంబమని తెలుసుకున్న కానిస్టేబుల్ రమేశ్ రూ. 5 వేలు అందజేశారు.

మెదక్ మున్సిపాలిటీ : బాబ ఆలయంలో భక్త జనసందోహం

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

■ కిటకిటలాడిన షిరిడీ సాయి ఆలయాలు ■ ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం షిరిడీ సాయి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయినామ స్మరణ జపంతో మార్మోగాయి. దీంతో మెదక్ జిల్లా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయాలకు ఉదయం నుంచే భక్తుల తాకిడి మొదలైంది. ఈ సందర్భంగా షిరిడీ సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలతో పాటు క్షీరాభిషేకం నిర్వహించారు. దీంతో ఆ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచే ఉత్సవాలు మొదలయ్యాయి. ఆలయాలకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. – న్యూస్ నెట్‌వర్క్, మెదక్ జూలై 21

చిన్నశంకరంపేట : స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ: సత్యసాయి మందిరంలో..

చేగుంట : కర్నాల్‌పల్లి షిరిడీ సాయిబాబా ఆలయంలో 108 కలశ పూజ చేస్తున్న భక్తులు

మెదక్‌రూరల్ : హోమం నిర్వహిస్తున్న భక్తులు

శివ్వంపేట : గురుమూర్తుల దర్శనం కోసం వచ్చిన భక్తులు

రోజంతా మురుసు

చిన్నశంకరంపేట : కురుస్తున్న వర్షం

నారుమడిలో తూకం పీకుతున్న కూలీలు

నర్సాపూర్, జూలై 21 : నర్సాపూర్ పట్టణంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురు కురుస్తున్నది. దీంతో జన జీవనం కొంత స్తంభించింది. కొద్దిరోజులుగా వర్షాలు లేక రైతన్నలు ఇబ్బందులకు గురయ్యారు, ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో కొంత ఊరట లభించింది. వర్షం రాకతో వరినాట్లు జోరందుకున్నాయి.

రెండో రోజు..

చిన్నశంకరంపేట, జూలై 21 : తుఫాన్ ప్రభావంతో చిన్నశంకరంపేటతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎడతెరిపి లేకుండా చిరుజల్లుల వర్షం కురిసింది. రెండు రోజుల పాటు చిరుజల్లుల వర్షం కురవడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వర్షం కురవడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ముమ్మరంగా వరినాట్లు కొనసాగుతున్నాయి. కొంతమంది రైతులు స్థానిక కూలీల కొరత తీర్చేందుకు బిహార్ రాష్ట్రం నుంచి కూలీలను రప్పించి వరినాట్లు వేయిస్తున్నారు. 20మంది బిహార్ కూలీలు రోజూ ఐదు నుంచి ఆరు ఎకరాల వరకు వరినాట్లు వేస్తున్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, జులై 21 : శివ్వంపేటలో ఆదివారం తెల్లవారుజాము నుంచి మొదలైన వర్షం సాయంత్రానికి కూడా అదేస్థాయిలోకురిసింది. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మోస్తారు వర్షం కురిసింది. మండలంలోని రెడ్యతండా పంచాయతీలోని వెంకృతండాలో గుగ్లోత్ పాండుకు చెందిన పాడి గేదె విద్యుత్ స్తంభానికి తాకడంతో షాక్ తగిలి మృతిచెందింది. దీంతో రూ. 80వేల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు గుగ్లోత్ పాండు వాపోయాడు.

ఫలాంబరి రూపంలో వనదుర్గామాత

పూజలు అందుకుంటున్న వనదుర్గమాత

పాపన్నపేట, జూలై 21 : జగత్ జనని ఏడు పాయల వనదుర్గాభవాని మాతను ఆషాఢ మాసం మూడో ఆదివారం పురస్కరించుకొని రకరకాల పండ్లలతో ఫలాంబరి దేవి రూపంలో వినూత్న రీతిలోఅలంకరించారు. ఈ సందర్భంగా వేకువజామున నుంచి ఏడు పాయలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు మంజీరానదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు చేసి దుర్గామాతను దర్శించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం కుంకుమార్చనలు తలనీలాలు, బోనాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో కృష్ణ ప్రసాద్, సిబ్బంది సూర్యశ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్సింహులు, వర్ణాచారి, రాజు, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్, రాజశేఖర్ పూజలు నిర్వహించారు. ఎస్సై నరేశ్ బందోబస్తు చేపట్టారు.

విద్యార్థిని ఆత్మహత్య

చేగుంట, జూలై 21 : సెల్‌ఫోన్ కొని ఇవ్వడం లేదని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా మండలంలోని రుక్మాపూర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మ్యాకల శోభరాణి స్వామిల కూతురు మ్యాకల రుచిత (18) మెదక్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతుంది. కుటుంబ సభ్యులతో సెల్‌ఫోన్ కావాలని కోరగా ఇప్పుడే సెల్‌ఫోన్ ఎందుకని మందలించడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొంది. ఘటనా స్థలానికి చేగుంట పోలీసులు చేరుకొని విచారణ చేపట్టారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాల్‌రాజు తెలిపారు.

కరాటేలో సత్తా చాటిన తూప్రాన్ విద్యార్థులు

తూప్రాన్, జూలై 21 : హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫస్ట్ ఇంటర్నేషనల్ కరాటే పోటీలో తూప్రాన్‌కు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. అండర్-10 బాలికల విభాగంలో తూప్రాన్‌లోని అవన్ స్కూల్లో చదువుతున్న 4వ తరగతికి చెందిన బి.జాను, అండర్-8 విభాగంలో 3వ తరగతికి చెందిన బి. కీర్తి మొదటి స్థానంలో నిలిచి బంగారు పథకాలు సాధించారు.

మృతుడి కుటుంబానికి నిత్యావసరాలు అందజేత

నిత్యావసర సరుకులను అందిస్తున్న లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

చిన్నశంకరంపేట, జూలై 21 : మండల కేంద్రానికి చెందిన కౌలు రైతు దడువాయి పరమేశ్వర్ కొద్ది రోజుల క్రితం అప్పులు తీర్చలేక బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు. పేదరికంతో తినడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకొని ఈ కుటుంబానికి ఆదివారం ఉదయం నల్గొండ జిల్లా నకిరేకల్‌కి చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు నెలలకు సరిపడా నిత్యావసరాలను పిల్లల తల్లి శంకరమ్మకు అందజేసి మానవత్వం చాటుకున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధి కర్నాటి నరేశ్, పులిరాజు, పోచయ్య పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి అమ్మవారికి బోనాలు

చల్మెడలో బోనాలతో వెళ్తున్న మహిళలు

నిజాంపేట, జూలై 21 : ఆషాఢ మాసం పురస్కరించుకొని నిజాంపేటలో మున్నూరు కాపు సంఘం సభ్యులు ఆదివారం మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ మేరకు గ్రామ ప్రధాన వీధుల్లో చేపట్టిన బోనాల ఊరేగింపు కార్యక్రమం కనులవిందుగా జరిగింది. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం సభ్యులు వెంకటేశం, మహేశ్, లక్ష్మణ్, తిరుపతి, మహేందర్, రాజు, మల్లేశం, వెంకటేశ్, బాల్‌రాజు, భాను, ప్రసాద్, సిద్ధిరాములు తదితరులు ఉన్నారు.

చల్మెడలో..

నిజాంపేట మండలంలోని చల్మెడలో గ్రామ దేవత ఆలయాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆదివారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. గ్రామస్తులందరూ బోనం ఎత్తడంతో గ్రామం అంతటా పండుగ వాతావరణం సంతరించుకుంది. శివసత్తుల ఆటలు, బైండ్ల వారి పాటలు అందర్నీ అలరించాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, రమేశ్, మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, గ్రామస్తులు ముత్యం రెడ్డి, మల్లేశం, రమేశ్, బాగయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో..

కౌడిపల్లి, జూలై 21 : మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా నల్లపోచమ్మకు బోనాలు తీశారు. ఆదివారం గౌడసంఘం మహిళలు వాడవాడలా బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నల్లపోచమ్మ ఆమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 21 : బదిలీపై వెళ్తున్నన్నె ఎస్‌జీటీ ఉపాధ్యాయులను సత్వరమే రిలీవ్ చేసి వారి స్థానంలో తాత్కాలిక ఉపాధ్యాయులను (విద్యా వలంటీర్లు) నియమించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ స మావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే చేపట్టడం అభినందనీయమన్నారు. వారి స్థానాల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. లిప్టు ఓవర్ వేకెన్సీ పోస్ట్‌ను తదుపరి సీనియారిటీ ఉపాధ్యాయులతో పదోన్నతులు కల్పించాలని, వెబ్ ఆప్షన్‌లో జరిగిన పొరపాట్లను సరిచేసి అప్పీల్ చేసుకున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు, బాధ్యులు అజయ్, కవిత, రవీందర్‌రెడ్డి, సుధాకర్, నాగుల్ మీరా, సృజన, గంగాధర్ రావు, శేషగిరిరావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నుజ్జునుజ్జయిన మూడు కార్లు

■ ఐదుగురికి కాళ్లు విరిగి.. ■ మరో 9మందికి తీవ్రగాయాలు ■ మెదక్ జిల్లా కౌడిపల్లిలో ఘటన



కౌడిపల్లి సమీపంలో ఢీకొన్న కార్లు..

కౌడిపల్లి, జూలై 21 : ఎదురెదురుగా కార్లు ఢీకొన్న ప్రమాదంలో మూడు కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారిలో ముగ్గురికి రెండు కాళ్లు విరిగిపోగా, మరో ఇద్దరికి ఒక్కో కాలు విరిగి, మరో 9 మందికి తీవ్రగాయాలైన ఘటన కౌడిపల్లి సమీపంలోని కల్వర్టు వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన ముస్లింలు కారులో కుటుంబ సభ్యులు మెదక్ వెళ్లి వస్తున్నారు. మరొకరు సంగారెడ్డికి చెందిన కుటుంబ సభ్యులతో కలిసి ఏడుపాయల దుర్గమ్మ వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కౌడిపల్లి కల్వర్టు వద్దకు రాగానే ఈ రెండు కార్లు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. దీంతో కార్లు ఒకదానికొకటి ఇరుక్కుపోయాయి. అదే సమయంలో మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి గుర్రం వెనకాల తాను బైక్‌పై రాంగ్‌రూట్‌లో వస్తూ నర్సాపూర్ వైపు వస్తున్న కారును గుర్తించి ఢీకొని ఎదురుగా వస్తున్న రెండు కార్లను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. వర్షం కురుస్తుండడంతో కొందరిని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి రోడ్డుపై ఉన్న కార్లను జేసీబీ సాయంతో తొలగింపజేశారు.

జాతీయ రహదారిపై ఢీకొన్న కార్లు

రామాయంపేట, జూలై 21 : రామాయంపేట జాతీయ రహదారిపై కార్లు ఢీకొన్నాయి. ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. రహదారిపై సుమారు 10 కార్ల వరకు ఢీకొన్నాయి. దీంతో కార్లలో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 21 : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ సూచించారు. అత్యవసర పనులు ఉంటేనే బయటకు రావాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండరాదన్నారు. ఏవేని సమస్యలు ఉంటే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ ఎదుట ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ దుకాణాలు కురుస్తున్న వానలకు స్లాబ్ నుంచి నీరు లీకేజీ కావడంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

కరెంటు స్తంభాలను తాకవద్దు

చిన్నశంకరంపేట, జూలై 21 : గత రెండు రోజులుగా వర్షాలు కురస్తున్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తడిసిన కరెంటు స్తంభాలను తాకవద్దన్నారు. రైతులు తమ బోరుబావుల వద్ద స్టార్టర్ డబ్బాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లవద్దన్నారు. కరెంటు సమస్యలు ఏవైనా ఉంటే సంబంధిత గ్రామాల్లో లైన్‌మెన్‌లను సంప్రదించాలని సూచించారు. కరెంటు వైర్‌కింద ఉండి సెల్‌ఫోన్‌లు మాట్లాడవద్దన్నారు.

సమాచారం ఇవ్వండి..

నర్సాపూర్, జూలై 21 : భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పుష్పరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ప్రమాదాలు తలెత్తిన పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఆపద సమయంలో సహాయం కోసం పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8712657888 లేదా డయల్ 100కి లేదా దగ్గరలో ఉన్న పోలీస్ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందిన వెంటనే తక్షణ సహాయ చర్యలు చేపడతామని వెల్లడించారు. రాగల 24-48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్త వహించాలని తెలిపారు.

26 నుంచి మహంకాళి బ్రహ్మోత్సవాలు

రామాయంపేట, జూలై 21 : పట్టణంలోని మహంకాళి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 26 నుంచి 29వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పాండురంగా చారి, ఈవో రవికుమార్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 26న అఖండ దీపారాధన, 27న శాంతికల్యాణం, 28న బోనం ఊరేగింపు, 29న అమ్మవారి వార్షిక మహానివేదనతో ప్రతిరోజు ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నర్సాపూర్/చిన్నశంకరంపేట, జూలై 21 : కొత్తగా పట్టాదారు పాస్‌బుక్‌లు వచ్చిన రైతులు, గతేడాది రైతుబీమా నమోదు చేసుకోని రైతులు రైతుబీమా కోసం నమోదు చేసుకోవాలని ఏడీఏ సంధ్యారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 59 ఏండ్ల వయసు వారు ఆగస్టు 4వ తేదిలోగా మీ మీ క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించాలని కోరారు. దరఖాస్తు కోసం రైతుభీమా దరఖాస్తు ఫారం, పట్టా పాస్ బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డ్ జిరాక్స్, నామినీ ఆధార్ కార్డ్ జిరాక్స్ తీసుకురావాలని తెలిపారు. రైతుబీమాలో తప్పుల సవరణకు ఈ నెల 29 వరకు అవకాశం ఉందన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న రైతులు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని సూచించారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 21 : రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల లోపు కుల గణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలందరికి రిజర్వేషన్లను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచినా కాలయాపన చేస్తుందని తెలిపారు. ఇందుకు నిరసనగా సోమవారం జిల్లాలోని మండలాలలోని తహసీల్దార్లకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు కాశీనాథ్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WATER PROOFING
★Roof & Wall Crack Filling, Water Proofing Coatings, New & Old Bhathrooms Leakages, Water Tank & Sump Leakages, Rain Coat & Pest Control, Slab & Beems Injection Work, 10 years Waranty. Call: 9010425273, 8121425273.
NT-326124

OLD AGE HOME
★ఒమేగా హోంకేర్: వంట, ఇ